అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 23 అక్టోబర్ 2023 పేజీలు : 04

# రాష్ట్ర హోం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే అనంత





రాష్ట్ర హోం మంత్రిని కలిసిన ఎమ్మెల్యే అనంత, వైసీపీ ముఖ్య నేతలు, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ

**అనంతపురం సిటీ, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి తానేటివనిత నగరంలోని ఒక ప్రైవేట్ లాడ్జిలో బస చేశారు. హోం మంత్రి తానేటి వనితను అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే అనంతతోపాటు నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కొగటం విజయభాస్కర్‌రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్, మహిళా విభాగం నగరాధ్యక్షులు కృష్ణవేణిలు హోం మంత్రిని కలిసి సన్మానించారు. అదే విధంగా జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డిలు హోం మంత్రిని కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితిని, జిల్లా సమస్యలను హోం మంత్రి తానేటి వనిత పార్టీ ముఖ్యనేతలతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంశాలపై ముఖ్యనేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## నియోజకవర్గ ప్రజలకు గోనుగుంట్ల దసరా శుభాకాంక్షలు

**ధర్మవరం టౌన్, అక్టోబర్ 22 ప్రభాతవార్త**



ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎంఎల్ఎ గోనుగుంట్ల సూర్యనారాయణ దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అమ్మవారి కరుణా కటాక్షాలతో ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. పంచభూతాల సహకారంతో వర్షాలు బాగా కురవాలని, తద్వారా రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు. అమ్మవారి కృపతో చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందాలని ఆయన తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఆర్థికాభివృద్ధి చెంది వారిలో కొనుగోలు శక్తి పెరగాలని ఆయన ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో ప్రభుత్వం మారడంతో ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని రంగాల ప్రజలకు శుభం జరగాలని ఆయన దేవున్ని ప్రార్థించినట్లు తెలిపారు.

## కదిరి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ పి.సిద్దారెడ్డి దసరా శుభాకాంక్షలు

**కదిరి, అక్టోబర్ 22 ప్రభాతవార్త**



కదిరి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ పి.వి.సిద్దారెడ్డి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆదివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. చెడుపై మంచి దుష్ట శక్తులపై.. దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగే విజయదశమి అన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్దించాలని, అందరికీ ఆ భగవంతుడి దీవెనలు, ఆశీస్సులు ఉండాలి అని ఎమ్మెల్యే పివి.సిద్దారెడ్డి ఆకాంక్షించారు.

## హోంమంత్రి తానేటి వనితను కలిసిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



-మంత్రితో సమావేశమై పలు అంశాలపై చర్చ

**ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితను ఆదివారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కలిసారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకుగాను మంత్రి జిల్లా కేంద్రానికి విచ్చేయగా మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే మంత్రికు పుష్పగుచ్చం అందించారు. అనంతరం మంత్రితో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే పలు అంశాలను చర్చించారు.

## సుఖసంతోషాలతో దసర పర్వదిన వేడుకలు జరుపుకోవాలి



**శ్రీసత్యసాయి జిల్లా, అక్టోబర్ 22, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా వ్యాప్తంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, జగన్మాత ఆశీస్సులతో దసర పర్వదిన వేడుకలు జరుపుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా ప్రజలకు విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి, దుష్టశక్తులపై దైవశక్తి సాదించిన విజయానికి ప్రతీకగా దసర పర్వదినం జరుపుకోవడంజరుగుతుందన్నారు. విజయ దశమి సందర్భంగా దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్క కుటుంబాలకుఉండాలని, అందరూ అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు.

## ఎస్‌పి చేతుల మీదుగా

# ఘనంగా ఆయుధ పూజ




ఆయుధ పూజ నిర్వహిస్తున్న జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి

**శ్రీసత్యసాయి జిల్లా, అక్టోబర్ 22, ప్రభాతవార్త ప్రతినిధి:**

శ్రీసత్యసాయిజిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోనిజిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్.పి. ఎస్.వి.మాధవ రెడ్డి చేతుల మీదుగా ఆయుధపూజ అర్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అచ్చ తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా పచ్చటి తోరణాల మధ్య పట్టు వస్త్రాలు ధరించి ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి ఈ ఆయుధపూజ కార్యక్రమం నిర్వహించడం అబ్బురపరించింది. జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాహనాలకు జిల్లా పోలీస్ ఆయుధగారం, మోటారు ట్రాన్స్ పోర్టు విభాగాల్లో దుర్గామాత చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు విజయదశమి పర్వదిన వేడుకల శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ దుర్గామాత ఆశీస్సులు ఎల్లప్పుడు ప్రజలపై ప్రసరింపజేయాలని, ప్రజలు ప్రశాంతంగా, సంతోషంగాజీవించాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీసులకు తమ విధులు, సేవల్లో విజయాలుచేకూరాలని, పర్వదినమైన, పండుగ బందోబస్తు అయినా పోలీసులు మనస్ఫూర్తిగా విధులు నిర్వహిస్తారన్నారు. ప్రస్తుతంజిల్లా వ్యాప్తంగా పోలీసు అమరవీరుల వారోత్సవాలు జరుగుతున్నాయని, ప్రజలు సహకరించి ఈ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎస్.విష్ణు, ఎఆర్‌డిఎస్‌పి జడ్.విజయ్‌కుమార్, పుట్టపర్తి డిఎస్‌పి వాసుదేవ్, ఎస్‌బి సిఐ రవీంద్రారెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీహర్ష, ఆర్‌ఐలు టైటాస్, నారాయణ, రాజశేఖర్ రెడ్డి, ఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

### నేడు స్పందన కార్యక్రమం రద్దు

ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని విజయదశమి పర్వదిన వేడుకలను పురస్కరించుకొని ఈ సోమవారం రద్దు చేసినట్లు జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున ఈ విషయాన్ని గమనించి జిల్లా నలు మూలల నుండి ఎస్‌పి కార్యాలయానికి విచ్చేసే ప్రజలు రావద్దని సూచించారు.

# విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్




**అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, దుష్టశక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పండుగ అన్నారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు వరించాలన్నారు. దసరా హిందూవులకు ముఖ్యమైన పండుగని, ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుండి నవమి వరకు 9 రోజులు దేవి శరన్నవరాత్రులతో కలిసి 10వ రోజు విజయదశమి కలసి దసరా పండుగ జరుపుకుంటారని, ఇది ముఖ్యంగా శక్తి ఆరాధనకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే పండుగ అన్నారు. విజయదశమి పండుగ సందర్భంగా దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్క కుటుంబానికి వుండాలని అందరూ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో విజయదశమి పండుగను జరుపుకోవాలని వారు సూచించారు.

## ఎస్పీ చేతులమీదుగా పూజా కార్యక్రమాలు



**అనంతపురం, అక్టోబరు 22, ప్రభాతవార్త ప్రతినిధి**

అనంతపురం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఆదివారం ఘనంగా ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ చేతులమీదుగా ఆయుధ పూజ నిర్వహించారు. జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, వాహనాలకు జిల్లా ఎస్పీ పూజ కార్యక్రమాలు చేపటప్టారు. ముందుగా దుర్గామాతా చిత్రపటానికి ఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ప్రజలు ప్రశాంతంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.

← ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ అన్బురాజన్

# గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి




**పుట్టపర్తి టౌన్, అక్టోబర్ 22 ప్రభాతవార్త**

రాబోవు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పుట్టపర్తి మున్సిపాలిటీ పట్టణంలోని 6,7,8,12,14 వార్డులో వైకాపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రం వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు,చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. చెప్పిన హామీలతో పాటు చేప్పని హామీలను సైతం పార్టీలు, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా ప్రజలకు అందిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని, 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, కన్వీనర్ రంగారెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు ఆవుటాల రమణారెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, నారాయణ రెడ్డి, వైస్ ఛైర్మన్ తిప్పన్న, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## టి.బి.డ్యాంలో నీటి లభ్యత మేరకు హెచ్‌ఎల్‌సీకి నీరు

- తుంగభద్ర రైతు సంఘానికి డి.సి.ఎం. డి.కె.శివకుమార్ హామీ

**బళ్లారి, అక్టోబర్22, ప్రభాతవార్త**

తుంగభద్ర జలాశయం నుంచి హెచ్‌ఎల్‌సీ కాలువకు నీటి లభ్యత మేరకు నీరు వదులుతామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ హామీ ఇచ్చినట్లు తుంగభద్ర రైతుసంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ తెలిపారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేసిన ఆయన శుక్రవారం సాయంత్రం బెంగళూరులో డి.సి.ఎం.డి.కె.శివకుమార్‌ను కలిసి హెచ్‌ఎల్‌సీ కాలువ కింద ఆయకట్టు భూముల్లో రైతులు లక్షలాది ఎకరాల్లో వరి, మిరప పంటలు సాగుచేశారని, నవంబర్ 10వ తేదీ వరకు హెచ్‌ఎల్‌సీకి నీరు వదిలితే కోట్లాది రూపాయల పంటను రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నదని, కొప్పళ, రాయచూరు, బళ్లారి జిల్లాల ప్రజాప్రతినిధులతో మంత్రి నాగేంద్ర తుంగభద్ర బోర్డు అధికారులతో మాట్లాడి జలాశయం నుంచి కాలువకు ఈనెలాఖరు నీటి సరఫరా కొనసాగించాలని చెప్పారని, కావునా రైతులు ఆందోళన చెందవద్దని పురుషోత్తంగౌడ తెలిపారు.



శివకుమార్‌ను కలిసి హెచ్‌ఎల్‌సీకి నీటి సరఫరా కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్న తుంగభద్ర రైతుసంఘం నాయకులు

వైసిపి పతనం పవన్‌కళ్యాణ్‌తోనే సాధ్యం
ప్రతి యువత దేశ భక్తిని కలిగి ఉండాలి
ఘనంగా ఆయుధ పూజ
కృష్ణా జలాల పునఃపంపిణీపై 25న రౌండ్ టేబుల్ సమావేశం - సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్
4 లో

## జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ దృశ్యం

బ్రహ్మాసముద్రం అక్టోబర్ 22 ప్రభాతవార్త,

మండంలోని పాలవెంకటాపురం పంచాయితీలోని జగనన్న కాలనీలో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసిన వైసీపి నాయకులు.ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీలో తాగునీరు, కరెంట్, కాలనీ వసతులలో భాగంగా అదివారం పాలబండ్ల చంద్రశేఖర్, అయ్యన్న , వైసీపి నాయకులు కాలనీలో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుచేశారు

## దీక్షా భూమి యాత్ర రథానికి జిల్లాధికారి శ్రీకారం



దీక్షాభూమి బస్సు యాత్రను ప్రారంభిస్తున్న జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి, అక్టోబర్22, ప్రభాతవార్త

డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవనశైలి, ఆయన సిద్ధాంతాలు అందరూ జీవనంలో అలవర్చుకోవాలని, ఆయన చూపినమార్గంలో మనమంతా నడుచుకోవాలని జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా అభిప్రాయం వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డా.బి.ఆర్.అంబేడ్కర్ దీక్ష భూమి యాత్ర రథానికి శ్రీకారం చుట్టి మాట్లాడారు. మహామనిషి డా.బి.ఆర్.అంబేడ్కర్ భారతదేశపు జ్ఞాన సంపన్నుల్లో ఒకరని, ఆయన ఆదర్శాలు మనందరికీ స్ఫూర్తిగా ఉండాలని, అంబేడ్కర్ దీక్ష భూమి స్థలం సందర్శించడం ద్వారా ఆయన అడుగుజాడల్లో మనమంతా నడవడంతో పాటు మన ముందు తరాల పిల్లలకు దీక్ష భూమి ఒక స్మారకంగా ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.హెచ్.సతీష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సాంఘిక సంక్షేమశాఖచే అంబేడ్కర్‌ను అభిమానించే వ్యక్తులకు దీక్ష భూమి యాత్ర అనే కార్యక్రమం నిర్వహించి, అంబేడ్కర్ దీక్ష పొందిన స్థలానికి ప్రభుత్వపు ఖర్చుతో పంపడం జరుగుతుంది. ఈ సంవత్సరం 160 మందిని దీక్ష భూమికి పంపుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంలో తాలూకా అసిస్టెంట్ డైరెక్టర్ మమత, సండూరు తాలూకాధికారి వెంకటేష్ తదితర శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటమి జీర్ణించుకోలేక బీజేపీ వారు దిగజారుడు రాజకీయం చేస్తున్నారు



వెంకటేష్‌హెగడే

బళ్లారి, అక్టోబర్22, ప్రభాతవార్త

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు జారీలోకి తీసుకురావడంతో పాటు ఐదు గ్యారెంటీ యోజనలు అమలులోకి తెచ్చి ప్రజల నుంచి మన్ననలు పొందుతున్న కాంగ్రెస్ పార్టీ పట్ల బీజేపీకి చెందిన నాయకులు ఓటమిని జీర్ణించుకోలేక దిగజారుడు రాజకీయం చేస్తున్నారని, దీనిని మానుకుంటే వారికి కొంత గౌరవం ఉంటుందని కేపీసీసీ మీడియా ప్రతినిధి వెంకటేష్‌హెగడే తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కాంగ్రెస్ దేశ నాయకులపై, ముఖ్యమంత్రి, మంత్రులపై సోషల్ మీడియాలో బీజేపీకి చెందిన నాయకులు పదేపదే ఆరోపణలతో పాటు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ముస్లింల పరంగా మాత్రమే ప్రభుత్వం పనిచేస్తున్నదని, పోస్టులు పెడుతుండడం బీజేపీ నీచ నికృష్ట చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నిరుపేదలపాలిట ఆశాకిరణంగా ఉన్న సిద్ధరామయ్య ఉచిత బస్సు సంచారాన్ని కేవలం ముస్లీం మహిళలకు ఇవ్వలేదని, అలాగే రూ.2 వేలు ఆర్థికసాయం ముస్లీం మహిళలకు మాత్రమే ఇవ్వలేదని, అన్నభాగ్య, యువనిధి యోజనల కింద కేవలం ముస్లీం మహిళలకు ఇవ్వడంలేదని, అందరికీ అన్నివర్గాల ప్రజలకు జాతి, కుల, మత బేధాలు లేకుండా ఐదు గ్యారెంటీ యోజనల ప్రయోజనం చేకూర్చిపెట్టారని, ఇది గమనించి కూడా బీజేపీ నాయకులు ఇష్టానుసారంగా సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టి ప్రజల్లో అలజడి సృష్టిస్తున్నారని, రాష్ట్ర ప్రజలెవరూ బీజేపీ చేస్తున్న అసత్య పోస్టింగ్‌లకు లెక్కజేయరని, వారికి తగిన గుణపాఠం ప్రజలు విధానసభ ఎన్నికల్లోనే చెప్పారని తెలిపారు. ఇకనైనా బీజేపీ నాయకులు సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేరీతిలో సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టకూడదని, అలాగే కొనసాగిస్తే రాష్ట్రంలో బీజేపీకి పుట్టగతులు కూడా ఉండవని వెంకటేష్‌హెగడే తెలిపారు.

## విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం



విరాళం అందిజేస్తున్న దృశ్యం

డి.హిరేహాళ్ అక్టోబరు 22 ప్రభాతవార్త

మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు రాయదుర్గం వాల్మీకి సంక్షేవ సేవా సమితి అధ్యక్షులు చేయూతనిచ్చి సహకారం అందించారు. కోట్లు గడించిన సాటి మనిష కి సహాయం చేయాలన్న గుణం కొందరికే ఉంటుంది. కష్టపడి సంపాదించిన సొమ్ములో ఎదుటివారికి ఎంతో కొంత చేయూత నివ్వాలన్న గుణం ఉన్న వ్యక్తి మన బండి అంటూ పలువురు అభినందిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప విరాళ దాతగా అన్ని వర్గాల వారి దీవెనలు అందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన వాల్మీకి సంక్షేమ సేవా సమితి తరుపున ఆ సేవా సమితి కార్యదర్శి ఎన్.టి. సిద్దప్ప, ఉపాధ్యక్షులు మలకన్న, కోశాధికారి నాయకుల బండి చంద్రశేఖర్, ఉప కోశాధికారి పైతోట రఘు, మిత్రులతో కలసి డి.హిరేహాళ్ మండలం తమ్మేపల్లి గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనకు రూ.10116 లు విరాళం అందజేశారు. విరాళం కోసం వచ్చిన ఆ గ్రామ వాల్మీకి కమిటి సభ్యులు రాయదుర్గం పట్టణంలోని ఆయన స్వగృహంలో కలుసుకున్న గంగప్ప, గోపాల్, సిద్దప్ప, చిన్నపాలయ్య, నాగప్ప, జయరాం, ఆంజనేయులు, మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన గురించి ఆయనకు వివరించారు. అందుకు సమ్మతించిన ఆయన వాల్మీకి సంక్షేమ సేవా సమితి సభ్యులతో విరాళం అందించి తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు. విరాళం అందుకున్న కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తేలుపుతూ తాము విరాళం అడిగిన వెంటనే లేదనకుండ సహకారం అందించినందుకు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాల వారికి అడిగిన తక్షణం సుభ కార్యాలకే కాకుండా విగ్రహ ప్రతిష్టాపన, ఆలయాల పునరుద్దరణ, నూతన ఆలయాల నిర్మాణాలకు, దేవాలయాల్లో సేవా, అన్నసంతర్పణ కార్యక్రమాలకు తనకు తోచినంత సహాయంచేసి చిరునవ్వుతో పంపుతారని ఆయా సామాజిక వర్గాల వారి ఆశీర్వాదం అందుకుంటున్నారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సేవా సమితి ప్రధాన కార్యదర్శి తలారా రాజప్ప, మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, బోయపాటి ప్రకాష్, హనుమంతరాయుడు, సభ్యులు సిద్దలింగప్ప, తిప్పేస్వామి, సత్తి, మిత్రులు న్యావాదులు సూర్యజాన్‌సన్, రఘునాయక్, విశ్రాంతి ఉద్యోగి గొల్ల గోపాల్ పాల్గొన్నారు.

## అత్యవసర పరిస్థితుల్లో ఏబీ నెగిటివ్ రక్తదానం



రక్తదానం చేస్తున్న గుంతకల్లుకు చెందిన శివ

ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త

విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామానికి చెందిన ఒక మహిళకు అత్యవసర పరిస్థితుల్లో గుంతకల్లుకు చెందిన శివ అనే యువకుడు తన అరుదైన ఏబీ నెగిటివ్ రక్తాన్ని దానం చేశాడని ఆపద్బాంధవ ట్రస్టు వ్యవస్థాపకులు వేల్పుల మురళి ఆదివారం తెలిపారు. అనంతపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో సదరు మహిళకు చికిత్స జరుగుతుండగా అత్యవసరంగా రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించారని దీంతో ఆమె కుటుంబ సభ్యులు రక్తదాతల కోసం అన్వేషించినా ఫలితం లేకపోయిందని విషయం తమ ట్రస్టుకు తెలియడంతో గుంతకల్లుకు చెందిన శివను సంప్రదించగా ఆయన గుంతకల్లు రక్తనిధికి చేరుకొని రక్తదానం చేశారన్నారు. రక్తదాత, ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన గుంతకల్లు ఆర్‌డిఓ వాకా శ్రీనివాసులురెడ్డి నియామకం

**- ఒక్కరోజులోనే బదిలీ అయిన గుంతకల్లు నూతన ఆర్‌డిఓ అనూరాధ**

గుంతకల్లు, అక్టోబర్ 22 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం నుండి గుంతకల్లు రెవెన్యూ డివిజన్ కార్యాలయం నూతన ఆర్‌డిఓ అధికారిగా వాకా శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ ఆదివారం ఆకస్మికంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కాగా గత రెండు రోజుల క్రితం గుంతకల్లు నూతన ఆర్‌డిఓగా అనూరాధ నియామక ఉత్తర్వులతో ఒక్క రోజు విధుల నిర్వహణ భాధ్యతల స్వీకరణతో ఉండగానే ఆకస్మికంగా ఆదివారం ఆమెను హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ 4 కర్నూలు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం.

## గుత్తిలో ఘనంగా ఆయుధపూజ



మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆయుధపూజ చేస్తున్న దృశ్యం

గుత్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

గుత్తి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం దుర్గాష్టమి పురస్కరించుకుని ఘనంగా ఆయుధపూజ గావించారు. మున్సిపల్‌కార్యాలయం ప్రాంగణంలో చైర్‌పర్సన్ వన్నూర్‌బీ ఆయుధపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలకు, పారిశుధ్య సిబ్బంది వినియోగించే పరికరాలకు ఆమె పూజ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఎల్ఎం ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయుధపూజ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు వినియోగించే దుస్తులు, బాలు, తదితర వాటికి పూజ గావించారు. భవిష్యత్తులో ఫుట్‌బాల్ క్రీడల్లో విద్యార్థులు రాణించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కోచ్‌లు దాదా, సునీల్, లోకా, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొమురం భీమ్ జయంతి

**-ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ**

**-హాజరైన రూరల్ సీఐ ఎన్.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి**



రూరల్ సర్కిల్ కార్యాలయంవద్ద కొమరం భీమ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రూరల్ సీఐ ఎన్.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక నాయకులు

ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త

తెలంగాణ విముక్తి కోసం ఆసఫ్ జహి రాజవాసానికి వ్యతిరేకంగా పోరాడిన అదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజనోద్యమ నాయకుడు కొమురం భీమ్ జయంతిని ఆదివారం ఉరవకొండలో ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక ఘనంగా నిర్వహించింది. స్థానిక రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంవద్ద జరిగిన కొమురం భీమ్ జయంతి వేడుకలుకు రూరల్ సీఐ ఎన్.ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి ముఖ్య అతిధులుగా హాజరుకాగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రికి చేరుకొని రోగులు, వారి సహాయకులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేయూత, ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్య వేదిక, బీఎస్‌పీ, ఎస్సీ జన సంఘం, ఏఐఎస్ఎఫ్, ఎంఆర్‌పీఎస్, ఎంపీఎంఎస్, దళిత సంఘాల నాయకులు మధుప్రసాద్, రాజశేఖర్, జగదీష్, మండ్ల ప్రభాకర్, రాము, రాజేష్, మీనుగ రామాంజినేయులు, చిరంజీవి, గణేష్, సురేంద్ర, గంగాధర్, నవీన్, యశ్వంత్, కార్తీక్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ మహర్నవమి పర్వదిన వేడుకలు

**-ధైర్యలక్ష్మిగా దర్శనమిచ్చిన ఉద్భవలక్ష్మి అమ్మవారు**

**-కొనసాగిన ప్రత్యేక పూజలు-కిటకిటలాడిన ఆలయాలు**



ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త

గతనెల 15వ తేది నుండి ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వివిధ ఆలయాల్లో శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ ఆదివారం మహర్నవమి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో స్వయంభూవుగా వెలసిన ఉద్భవలక్ష్మి అమ్మవారు ధైర్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉరవకొండ పట్టణంలోని దుర్గాభవాని ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్ధినిగా దర్శనమివ్వగా, ఈశ్వరమ్మ, ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయాలతోపాటు మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలోని భగళాముఖి ఆలయంలో అమ్మవార్లు దుర్గాభవానిగా దర్శనమిచ్చారు. ఉదయం మొదలు వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు పంచామృతాభిషేకం, లలిత సహస్రనామాలు, చండీపారాయణం, దుర్గా హోమం, దేవిభాగవత పారాయణం, అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఉదయం నుండి రాత్రి వరకు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు సంపూర్ణ సహకారం



సీఐ ఎన్.ప్రవీణ్‌కుమార్‌ను సన్మానించిన వైసీపీ నాయకులు

ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త

ఉరవకొండ నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు అన్నివేళలా తమ సంపూర్ణ సహకారం అందిస్తామని టీడీపీ, వైసీపీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు అన్నారు. పట్టణంలోని స్థానిక రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం వారు నూతన సీఐ ఎన్.ప్రవీణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి షాలువాలుకప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రేగటి నాగరాజు, చాబాల, మోపిడి గ్రామాల మాజీ సర్పంచులు చాబాల ఎర్రిస్వామి, మోపిడి గోవిందు, నాయకులు ఇంద్రావతి సుధాకర్, మోపిడి రాజగోపాల్, బెస్త నాగన్న, జె.లింగమూర్తి, ఎస్.మహేష్, వైసీపీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అభిమానులు విశ్రాంత సీడీపీఓ యం.రామాంజినమ్మ, యం.రామాంజినేయులు, ముష్టూరు ఎర్రిస్వామి, గుర్రం రామాంజినేయులు, ఆమిద్యాల హనుమంతు, కె.ఆంజి, వన్నప్ప, చిన్న గురు, ఎంఆర్‌పీఎస్ నాయకులు కౌకుంట్ల రవి, చెన్నప్ప, సురేష్, యం.రామాంజినేయులు, చంద్ర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## దాడులు చేయించి భయపెట్టాలనుంటే అది అవివేకమే..!

**-జనసేన నాయకుడు రాజారెడ్డిపై దాడికి మూల్యం చెల్లించకతప్పదు**

**-విలేఖరుల సమావేశంలో జనసేన జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్

ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త

అధికారం ఉందికదా అని దాడులకు తెగబడి భయపెట్టాలనుకుంటే అది అవివేకమే అవుతుందని ధర్మవరంలో జనసేన నాయకుడు రాజారెడ్డిపై దాడి చేసిన వారిని వదిలిపెట్టమని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తాళలేక, ఓటమి భయంతో జనసేన పార్టీకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీకు చెందిన స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆయన వారసులైన జనసేన నాయకులు ఎలాంటి దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భరతం పట్టడానికి జనం, జన సైనికులు సిద్దంగా ఉన్నారన్నారు. ధర్మవరంలో ఫ్యాక్షన్ రాజకీయాలు చేయాలన్న ఎమ్మెల్యే వైఖరి రాజరెడ్డిపై దాడి ఘటన సీసీ ఫుటేజీలు పరిశీలిస్తే స్పష్టమౌతున్నా పోలీసులు దాడి చేసిన వారిని అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్ని దాడులు చేసినా జనసేన నాయకులు, కార్యకర్తలు బెదిరేదిలేదని అధినేత పిలుపునిస్తే ఎలాంటి కార్యక్రమాలకైనా సిద్దమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉరవకొండ, వజ్రకరూరు, మండలాల అధ్యక్షుడు చంద్రశేఖర్, కేశవ్, నాయకులు దేవేంద్ర, రాజేష్, రమేష్, మల్లికార్జున, భోగేష్, మణికుమార్, భోపేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

## పంటలు చేతికందే వరకు హంద్రీనీవా, హెచ్‌ఎల్‌సీకు నీరివ్వాలి..!

**-సంతకాల సేకరణ చేపట్టిన ఏపీ రైతు, కౌలు, వ్యవసాయ కార్మిక సంఘాలు**



సంతకాలు సేకరిస్తున్న సీపీఎం అనుబంధ రైతు సంఘాల నాయకులు

ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త

రైతులు సాగుచేసిన పంటలు చేతికందేవరకు హంద్రీనీవా, హెచ్ఎల్‌సీ కాలువలకు నీటిని అందించాలని సీపీఎం పార్టీ అనుబంధ నాయకులు ఎస్.మధుసూదన్, శీనప్ప, సిద్దప్ప, మురళీ, వీరాంజినేయులు, వెంకటేష్ డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు ఆదివారం ఉరవకొండలో ఈ మేరకు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది సకాలంలో వర్షాలు రాకపోవడంతో ఖరీఫ్ పంటలు తీవ్రంగా నష్టపోయాయని నియోజకవర్గంలోని ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు, కూడేరు మండలాల్లో హంద్రీనీవా, హెచ్ఎల్‌సీ కాల్వల కింద పంటలు సాగు చేశారన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువ నిర్మాణ ం పూర్తీఅయి 10 సంవత్సరాలు గడిచినా డిస్ట్రిబ్యూటరీ, పిల్లకాలువలు తవ్వకపోవంతో ఆయకట్టుకు నీరు అందడంలేదన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు అప్పులుచేసి కాల్వలోని నీటిని మోటార్లు పెట్టి పొలాలకు మళ్లించి పంటలు పండించుకొంటున్నారన్నారు. దీనివల్ల రైతులకు అప్పుల భారం పెరుగుతున్నాయని ప్రతి సంవత్సరం పంట పూర్తయ్యేవరకు నీరు అందుతుందో లేదో తెలియని ఆందోళనలో రైతులు ఉండాల్సి వస్తోందన్నారు. ఈ ఏడాది తుంగభద్ర, కృష్ణా నదుల్లో నీరు లేదని పంటలకు నీరు అందివ్వలేమని నీటిపారుదల అధికారులు ప్రకటిస్తున్నారన్నారు. పంటలు మధ్యలో ఉన్నసమయంలో ఇలా ప్రకటించడంవల్ల రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. అత్యంత ఎక్కువ ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడిపెట్టి మిరప పంట ఈ నియోజకవర్గంలో దాదాపు 60వేల ఎకరాల్లో సాగైందన్నారు. సాగుదారుల్లో అత్యధికులు కౌలు రైతులు, ముందస్తు కౌలు చెల్లించి పంట పెట్టుకునే విధానం అమలవుతోందన్నారు. ఇప్పుడు కాల్వలకు నీరు నిలిపివేస్తే వేలకోట్ల రూపాయల పంట పెట్టుబడి రైతాంగం నష్టపోతుందన్నారు. తక్షణం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జోక్యం చేసుకొని కర్నాటక, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరిపి పంట పూర్తయ్యేవరకు డిసెంబర్ ఆఖరు వారం వరకు హంద్రీనీవా, హెచ్ఎల్‌సీ కాల్వలకు నీరు అందించాలని సంతకాలను పంపుతున్నామన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**-సందడి చేసిన 1999-20 మధ్య 10వ తరగతి చెందిన విద్యార్థులు**

**-విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి ఘన సన్మానం**



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

ఉరవకొండ, అక్టోబర్ 22 ప్రభాతవార్త

ఆప్యాయపు పలకరింపులు, అనురాగపు కౌగింతలతో మండల పరిధిలోని ఆమిద్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. పాఠశాలలో 1999-20 మధ్య 10వ తరగతి చదివిన విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం చదువుకున్న పాఠశాల వేదికగా ఘనంగా జరిగింది. ఉద్యోగ, వ్యాపారాల ఇతరత్రా కారణాల రిత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఉదయం నుండి సాయంత్రం వరకు తమ పాత మిత్రులతో అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఒకరి గూర్చి మరొకరు తెలుసుకుంటూ ఆనందంగా గడిపి ఒకరినొకరు చిరునామాలు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కార్యక్రమానికి ఆహ్వానించి వారి సేవలను కొనియాడి ఘనంగా సత్కరించారు. పాఠశాలలోనే ఏర్పాటు చేసుకున్న విందు భోజనాన్ని ఆరగించి సాయంత్రం వీడిపోమంటూ వీడలేమంటూ చమర్చిన కళ్లతో వెనుదిరిగారు.

## విశేష అలంకరణలో శ్రీషిరిడిసాయినాథుడు



గుత్తి, అక్టోబర్ 22 ప్రభాతవార్త

దేవి శరన్నరాత్రులను పురస్కరించుకుని గుత్తి పట్టణంలోని పలు దేవాయాలల్లోని దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీషిరిడిసాయిబాబా ఆలయంలో సాయినాథున్ని కాయగూరలతో త్రివర్ణ పతాకం రూపకల్పనతో అలంకరణ గావించారు. శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారిని మహిషాసురమర్ధిని అలంకారం చేశారు. అదేవిధంగా కోటలోని శ్రీయల్లమ్మ దేవాలయంలో, శ్రీగౌతమేశ్వరస్వామి ఆలయంలో, ఆర్ఎస్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు గావించారు.

# విశేష అలంకరణలో నేత్రానందకరంగా శ్రీవాసవాంబ

**- 8వ రోజు ప్రత్యేక అలంకరణలో శ్రీ దుర్గాదేవి (మహిషాసుర మర్ధిని)...**

**- ప్రత్యేకాకర్షణగా మహిషాసురుడి వధింపు - శ్రీదుర్గాదేవి వేషధారణలో చిన్నారులు**



విశేష అలంకరణలో శ్రీవాసవాంబ, ప్రత్యేక వేధికపై విశేష అలంకరణలో శ్రీదుర్గాదేవి, మహిషాసురుడి వధింపు దృశ్యం.

గుంతకల్లు, అక్టోబర్ 22 ప్రభాతవార్త

దసరాపండువను పురస్కరించుకుని శ్రీ దేవీశరన్నవరాత్ర మహోత్సవములలో భాగంగా స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ అష్టమి ఆదివారం 8వ రోజు హిందూ సాంప్రదాయ పద్ధతిన విశేష పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. గుంతకల్లు పట్టణంలోని వివిద దేవస్థానాలలో ఆయా కార్యనిర్వహణ సభ్యుల బృందాలు విశేష విధ్యుధీకరణతో పాటు ఆయా అర్చకుల బృందం ఆయా ఆలయాల అమ్మవార్లను విశేష అలంకరణ గావింపుతో ప్రత్యేక పూజల నిర్వహణలతో శ్రీవార్ల మూలవరుల దర్శనభాగ్యం కల్పించగా భక్తాదులు నేత్రానందకరంగా దర్శనంకై బారులు తీరారు. ఈక్రమంలోనే పట్టణంలోని ప్రసిద్ధ దేవాలయం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానంలో శ్రీదేవీశరన్నవ రాత్రోత్స వాలను పురస్కరించుకుని ఆదివారం ఆర్యవైశ్య సంఘం బృందం పర్యవేక్షణలో కేసరికుమార్‌శర్మ బృందంతో పాటు ఆలయ అర్చకబృందం సాయికుమార్‌శర్మ, వేంకటేశ్వరశాస్త్రిల నేతృత్వంలో ఆలయంలో విశేష పూజలు 8వ రోజు కొనసాగాయి. ఈ నేపథ్యంలో వారు ఆలయంలో ఉదయం అవాహిత దేవతాపూజలు, శ్రీచక్రార్చన ఇత్యాది పారాయణములుతో పాటు వైధిక విధానంలో " రుద్ర,దుర్గాసూక్త " హోమము తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈక్రమంలోనే గర్భాలయంలోని శ్రీవాసవాంబ మూలవరులకు వేదమంత్రోత్సా రణతో అభిషేకాల అనంతరం విశేష పుష్పములతో ప్రత్యేక అలంకరణ గావింపుతో వైధికంగా పూజలను నిర్వహించారు. సాయంత్రం ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక వేధిక ఏర్పాటుతో శ్రీ దుర్గాదేవి (మహిషాసుర మర్ధిని) అలంకరణ గావింపుతో పాటు దుర్గాష్టమిని పురస్కరింపుగా మహిషాసుర మర్ధిని అనే భక్తి పూర్వకమైన కార్యక్రమంలో భాగంగా దుష్టుడైన మహిషాసురుడి ప్రతిమ ఏర్పాటుతో శక్తి స్వరూపిణి దుర్గామాత కొలువై ఉన్న గర్భగుడి చుట్టూ ప్రదక్షిణ చేసి దుష్ట సంహారానికి సంకేతంగా మహిషాసురిడి శిరశ్చేధం కార్యక్రమంను అత్యంత వైభవంగా నిర్వహించారు. తదుపరి విశేష పూజలతో భక్తాదులకు దర్శనభాగ్యం కల్పనగా మహామంగహారతి తదితర పూజాకార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి తీర్థప్రసాదము వితరణగా అందచేశారు. అలాగే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 6:30గంటలకు శ్రీదుర్గాదేవి వేషధారణలో 1-8యేళ్ల వయసున్న చిన్నారి బాలికలతో పాటు మరికొందరు బాలికలు రెండు విభాగాలుగా ప్రదర్శన గావించగా ప్రథమ,ద్వితీయ,తృతీయ విజేతలుగా నిర్ణయించి వారికి ప్రోత్సాహక బహుమతులను అందచేయగా కార్యక్రమం నిర్వహణ చూపరులకు వీనులవిందు చేసింది. సదరు కార్యక్రమాల సందర్భాలను పురస్కరించుకుని దేవస్థానంకు భక్తాదుల రాకపోకలకు ఎలాంటి అంతరాయాలు కలగకుండా సేవాభావంతో ఆర్యవైశ్య సంఘం సభ్యులతో పాటు పోలీసు బృందం సంయుక్తంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

